


# పెనం మీంచి పొయ్యిలోకి

— కట్టా రాంబాబు

భార్య పుట్టింటి కెళ్తానంటే ఆమెను ట్రైయినెక్కించి యింటికొచ్చి తలుపులు తీసి లోపలి కొచ్చాడు అప్పారావు. అప్పటికే సమయం రాత్రి పది దాటింది.


'రా రా పడకింటికి..నిదురు రాదూ నా కంటికీ' పక్క వాటాలోంచి సుబ్బలక్ష్మి పాట విన్పిస్తుంది.

తల పట్టుకుని సోఫాలో కూర్చుండిపోయాడు అప్పారావు. ఇంక ఈ బాధ తప్పదనుకున్నాడు.

'రాజు లేనప్పుడు సారంగో నువ్వు రారాదా పోరాదా సారంగో' అంటూ మళ్ళీ అందుకుంది సుబ్బలక్ష్మి.

సుందరం కేంపు కెళ్ళుంటాడు అందుకే ఆవిడ యిష్టమొచ్చినట్లు పాడుకుంటుందనుకున్నాడు. లేచి వెళ్ళి మంచినీళ్ళు తాగొచ్చి మంచం మీద నడుం వాల్చాడు అప్పారావు.

'నీకు నీ వారు లేరు నాకు నా వారు లేరు నీకు నాకు జోడు కుదిరెను కదరా.చల్ మోహన రంగా' అంటూ ఇంకోపాట మొదలెట్టింది. రెండు చెవుల్లోను దూదిపెట్టుకుని పడుకున్నాడు అప్పారావు.




భర్త లేడు కదా అని ఆవిడేదో అప్పారావుని పిలుస్తుందనుకుంటే పొరపాటే అవుతుంది. నిజంగా ఆవిడ మహాసాధ్వి. అటువంటి ఆలోచనలు ఆవిడకు పొరపాటుగా కూడా రావు. పాటలు పాడుకోవడం సుబ్బులక్ష్మికో హాబీ. భర్త వుండగా పాడనివ్వడు. అందుకని భర్త లేనప్పుడు ఆవిడ తన కోరిక తనివి తీరా తీర్చుకుంటుంది. ఏ పాట ఎప్పుడు పాడుకోవాలో కూడా తెలియదు. పాటలు పాడాలనే మూడ్ వచ్చినప్పుడల్లా నోటికొచ్చిన పాట పాడేస్తుంది.

అప్పారావు, సుందరం చాలా కాలం నుంచి పక్క పక్క పోర్షన్సులో వుంటున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. వేరు వేరు డిపార్టుమెంట్సులో పనిచేస్తున్నారు. రెండు కుటుంబాలు బాగా కలిసి పోయాయి. సుబ్బులక్ష్మి అప్పారావుని అన్నయ్యా అని పిలుస్తుంది. ఆవిడకు అన్నయ్యలు లేరు. అప్పారావుని స్వంత అన్నయ్యలాగే భావిస్తుంది. శ్రావణ పూర్ణిమ రోజున రాఖీ కట్టించుకుని బహుమతి పుచ్చుకుంటుంది. పిల్లల చేత మామయ్యా అని పిలిపిస్తుంది. అప్పారావు భార్యని వదినా అని పిలుస్తుంది. సుందరం, అప్పారావులు ఒకర్నొకరు బావా అంటే బావా అనుకుంటారు. కాబట్టి సుబ్బులక్ష్మిని అనుమానించడానికి వీల్లేదు.

అప్పారావుకి పాటలంటే తగని చిరాకు. రేడియోలో వస్తున్నా, టీవీలో వస్తున్నా వెంటనే కట్టేస్తాడు. అంతకీ చిత్రలహరి వచ్చేటప్పుడు భార్య, పిల్లలు గొడవపెడితే బయటకుపోయి అవి పూర్తయ్యాక వస్తాడు. అటువంటి అప్పారావు ఎవరైనా సినిమా పాటలు పాడుతుంటే అసలు భరించలేడు. సుబ్బులక్ష్మి పాటల తాకిడికి యిల్లే మార్చేద్దామనుకున్నాడు. కాని రెండు కుటుంబాల మధ్య వున్న స్నేహం వల్ల అది వీలుకాలేదు.

సుబ్బులక్ష్మి పాటలు పాడుతున్నప్పుడల్లా చెవుల్లో దూది పెట్టుకోవడమో లేక బయటకు పోవడమో చేసేవాడు. పగలయితే అలాగే బయటకు పోవచ్చు కాని రాత్రిళ్ళు ఎక్కడికి పోవాలి?

ఇటువంటి పాటలు పాడుతున్న సమయంలో ఎవరైనా క్రొత్తవారు యింటికి వస్తే తన పరువేం కావాలి. నిజంగా అపార్థం చేసుకునే ప్రమాదం వుంది.

ఒకసారలాగే జరిగింది. అప్పుడు సుందరం కేంపు కెళ్ళివున్నాడు. భార్య వూరుకెళ్ళింది. అప్పడిలాగే సుబ్బలక్ష్మి ప్రేమగీతాలు, విరహ గీతాలు పాడుతోంది.

సరిగ్గా అటువంటి సమయంలో వచ్చాడు అవతారం.

అప్పారావు, అవతారం చిన్నప్పట్నించీ కలిసి చదువుకున్నారు. బియ్యే పాసయిం తర్వాత అప్పారావు ఉద్యోగంలో చేరితే అవతారం స్వంత వూళ్ళో వ్యవసాయం చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడు పనిమీద పట్నం వచ్చినప్పుడు అప్పారావుని కలిసి పోయేవాడు. ఈసారి భార్య వూళ్ళోలేని కారణంగా అవతారాన్ని యింట్లోనే వుండమన్నాడు అప్పారావు. ఆ రోజంతా ఆవిడ పాటలు పాడటం, భర్త యింట్లో లేకపోవడం, అప్పారావు భార్య కూడా లేకపోవడంతో సుబ్బలక్ష్మికి, అప్పారావుకి ఏదోవుందని ఆవిడ పాటల ద్వారా సంకేతం పంపుతుందని, తనున్న కారణంగా అప్పారావు వెళ్ళలేకపోతున్నాడని అవతారం అనుకున్నాడు.

ఆవిడ వ్యవహారం చూస్తుంటే పెద్ద హేండే అని కూడా అనుకున్నాడు. అవతారం ఆ రోజంతా పని చూసుకుని మర్నాటి ఉదయమే ఊరెకెళ్ళి పోవడానికి బయలుదేరాడు. పగలుండి రాత్రికి పొమ్మని అప్పారావు అతన్ని ఆపేసాడు. ఏదన్నా మార్నింగ్ షో కి పొమ్మని సలహా యిచ్చాడు. అప్పారావు ఆఫీసుకి, అవతారం మార్నింగ్ షోకి బయలుదేరాడు.

సినిమా చూసి ఏకంగా భోజనం పూర్తి చేసి ఇంటికొచ్చి నడుం వాల్చాడు అవతారం.

సాయంకాలం అప్పారావు ఆఫీసు నుంచి యింటికొచ్చేసరికి అవతారం మంచం మీద పడుకుని మూల్గుతున్నాడు. తలకి, చేతులకి కట్లుకట్టి వున్నాయి. చలి జ్వరం వచ్చినవాడిలా వణికిపోతున్నాడు.

''ఏం జరిగిందిరా'' అడిగాడు కంగారుగా.

గొల్లుమన్నాడు అవతారం.

'బలే మంచి రోజు పసందైన రోజు' పక్కవాటా లోంచి సుబ్బలక్ష్మి గొంతు విన్పిస్తోంది.

అవతారం ఏడ్పు విని కంగారు పడ్డాడు.

''ఏం జరిగిందో చెప్పరా'' **అడిగాడు** అప్పారావు.

''ఏం చెప్పమంటావురా. నాకు తగినశాస్తే జరిగింది. ఆవిడను అపార్థం చేసుకున్నందుకు యిలాగే జరగాలి.''

''అసలేమిటో సంగతి చెప్పరా.''

మధ్యాహ్నం జరిగిన సంఘటన చెప్పుకొచ్చాడు అవతారం. మంచి నిద్రలో వున్న అవతారం ఉలిక్కిపడి లేచాడు. ప్రక్కవాటాలో నించి పాట విన్పిస్తుంది.

'లే లే లే నా రాజా లేవ నంటావా నన్నే లేపమంటావా' ఆ పాట వింటూనే టక్కున లేచి కూర్చున్నాడు. అదయినే వెంటనే ఇంకో పాట. 'పిలిచినా పలుకవురా..ఔరరా పిలిచినా పలుకవురా'

ఆ పాటలు వింటుంటే అవతారానికి అనుమానం వచ్చింది.

ఈ సమయంలో అప్పారావుండడని తెలిసి ఎందుకు పాడుతుంది. తనున్నానని తెలుసు. ఒకవేళ తనని పిలవడం లేదు కదా!

ఏవుంది యిలాంటి వాటికి అలవాటు పడ్డవాళ్ళకి వెరైటీ కావాలి. కాబట్టి తననే పిలుస్తుండాలి.

'రమ్మంటే జాగేలరా...నీ కిది న్యాయమా ఓ ప్రియా..' అంటూ పాట విన్పించేసరికి యింక అవతారం మంచం మీద ఆగలేకపోయాడు. అంతలా పిలిచిం తర్వాత వెళ్ళకపోతే తనని చేతకాని వాడి ననుకుంటుంది.

'తొందర తొందర గుంది రావయ్యో మావయ్యో'

స్ప్రింగ్‌లా లేచాడు. తలుపులు దగ్గరగా వేసి సుబ్బలక్ష్మి వాళ్ళపోర్షను తలుపు తట్టాడు. సుబ్బలక్ష్మి తలుపు తీసింది. నవ్వుతూ 'రండి' అంటూ పిలిచింది.

''మీరు అప్పారావుగారి స్నేహితులటగా'' అనడిగింది.

అవతారానికి ధైర్యం వచ్చేసింది. లేచి తలుపులు వేసి సుబ్బలక్ష్మి చెయ్యి పట్టుకున్నాడు. బిత్తరపోయింది సుబ్బలక్ష్మి.

''ఏమిటి మీరు చేస్తున్నపని'' అనడిగింది చేతిని గింజుకుంటూ.

''ఏం తెలియనట్లు మాట్లాడకు'' అంటూ ఆమెను దగ్గరగా లాక్కోబోయాడు. ఆమెకు మతిపోయింది.

ఇదేమిటి యితనిలా ప్రవర్తిస్తున్నాడు అయినా వీడికెంత ధైర్యం అనుకుని నెమ్మదిగా తన చేతిని లాక్కుని అతని చెంపమీద గట్టిగా ఒక్కటిచ్చింది.

ఆ దెబ్బతో అవతారం షాక్ తిన్నాడు. ఆ చెంపా యీ చెంపా వాయించి పడేసింది. అతను తేరుకునేలోగా గబగబా లోపలికెళ్ళి అప్పడాల కర్రను పట్టుకొచ్చి దానికి పూర్తిగా పనిచెప్పింది.

### త్రాగుబోతు

''ఈ ప్రపంచంలో ఉన్న బంగారాన్ని, వజ్ర వైడూర్యాల్ని, కంపెనీలని, ఇంకా అన్నింటినీ నేను కొనేస్తాను'' అన్నాడో త్రాగుబోతు.

''అసలు వాటిని నేను నీకు అమ్మితేగా, నువ్వు కొనడానికి'' అన్నాడు ప్రక్కనే ఉన్న ఇంకో త్రాగుబోతు.

- తిరుమలరాజు రఘువర్మ
(దేవుపల్లి)

''వెధవా! ఎలా కనపడ్డా(నా)నీకు. నా చెయ్యి పట్టుకుంటావా ఎంత ధైర్యం రా నీకు. మళ్ళీ నా కంట పడ్డావా నీ ప్రాణం తీస్తాను'' అంటూ తలుపు తీసి బయటకు తోసేసింది. బ్రతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు అవతారం. చేతులకు, తలకు గట్టిగా దెబ్బలు తగలడంతో డాక్టరు దగ్గరకు పోయి కట్లు కట్టించుకొచ్చాడు.

...ఇదిరా సంగతి అన్నాడు అవతారం ఏడుస్తూ.

జరిగిన దానికి అప్పారావు చాలా బాధ పడ్డాడు. సుబ్బలక్ష్మి సంగతి వీడికి చెప్పకపోవడం తన తప్పే అనుకున్నాడు. మొత్తం మీద అవతారం దెబ్బలు తిని వెళ్ళాడు. సుబ్బలక్ష్మిని పిలిచి చెపుదామనుకున్నాడు అటువంటి పాటలు పాడొద్దని. కాని సభ్యతగా వుండదని వూరుకున్నాడు. సుందరం చెపితేనే వినలేదు తను చెపితే వింటుందా?

ఆ పిచ్చి తల్లికి ఎవరు చెప్పినా అర్థం కాదులే అని అనుకున్నాడు. ఇంక ఈ బాధలు యిలా

పడవలసిందే. మర్నాడు ఉదయం షేవింగ్ చేసుకుంటు న్నప్పుడు సుందరం పిల్లలు టిఫిన్, కాఫీలు పట్టుకొచ్చారు.

''మామయ్యా అమ్మ పంపింది. మధ్యాహ్నం భోజనం మా యింట్లోనే'' అన్నారువాళ్లు.

'ఎందుకు బాబూ' అందామనుకున్నాడు. 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి' అంటూ ప్రక్కవాటాలో నుంచి పాట విన్పించేసరికి వూరుకున్నాడు. అప్పారావుకి చాలాసార్లు అన్పించింది. యిల్లు మార్చేద్దామా అని. కాని భార్య ఒప్పుకోలేదు. యింకోచోట కెళితే యింతకన్నా పెద్ద సమస్యలొస్తే ఏం చేస్తారని అడిగింది. దాంతో వూరుకున్నాడు.

ఓరోజు అప్పారావు భార్య బాధగా అంది. ''ఏమండీ సుబ్బలక్ష్మి ఒదిన వాళ్ళకి ట్రాన్స్ ఫరయ్యిందట.''

''అరె!'' అని పైకి అన్నాడేగాని అప్పారావు లోపల బాగా సంతోషించాడు. యింక ఈ పాటలగోల తప్పిందిలే అనుకున్నాడు.

ఇల్లు ఖాళీ చేసి వెళ్ళేటప్పుడు సుందరం చాలా బాధపడ్డాడు. సుబ్బలక్ష్మి అయితే మరీను ఏకంగా ఏడుస్తూనే వెళ్ళింది. ఆ సమయంలో అప్పారావుకి కూడా బాధనిపించింది.

★★★

సుందరం, సుబ్బలక్ష్మి వెళ్ళి వారం రోజుల య్యింది. ఈవారం రోజులు చాలా ప్రశాంతంగా వుందనిపించింది అప్పారావుకి.

''పక్కింట్లో కొత్తవాళ్ళొస్తున్నారండి. మధ్యాహ్నం చూసి వెళ్ళారు. ఆయన స్కూలు టీచరట. ఆయనకో ఏభై ఏళ్ళుంటాయి. ఆవిడ చాలా మంచావిడలా వుందండి బాగా మాట్లాడారు. వాళ్ళకి నలుగురు పిల్లలట. ఈ సాయం కాలమే దిగుతారట''. అప్పారావు ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే భార్య చెప్పుకొచ్చింది.

''పోనీలే వాళ్ళు మంచివాళ్ళయితే మనకీ మంచిదేగా'' అన్నాడు అప్పారావు బట్టలు మార్చుకుంటూ.

టీ తాగి బజారుకు పోయి కాస్సేపు ఫ్రండ్స్‌తో కాలక్షేపం చేసి యింటికి తిరిగొచ్చాడు అప్పారావు. పక్కవాటాలో నుంచి సామాన్లు సర్దుకుంటున్న చప్పుడు విన్పిస్తోంది.

''వాళ్ళు దిగిపోయారండి. ఆయన టీచరు కదా మన పిల్లలకి ట్యూషను చెబుతారేమో కనుక్కోండి'' అంది భార్య.

''కనుక్కుందాం లేవే కొన్ని రోజులు పోనీయ్. మరీ వచ్చిన వెంటనే అడిగితే బాగుండదు'' అన్నాడు అప్పారావు.

తెల్లవారు జామున అయిదు గంటలకే ఉలిక్కిపడి లేచాడు అప్పారావు. పక్కవాటలో నుంచి హార్మోనియం శృతి చేసుకుంటున్న శబ్దం విన్పిస్తుంది. కాస్సేపటికే 'పరాబ్రహ్మ పరమేశ్వర' అంటూ ప్రార్థనాగీతం పాడుతుంటే దానికను గుణంగా హార్మోనియం వాయింపు.

ఆ తర్వాత 'బావా ఎప్పుడు వచ్చితీవు' అనే పద్యం 'చెల్లియో చెల్లకో' అంటూ మరో పద్యం అలా నాలుగయిదు డ్రామా పద్యాలు హై పిచ్‌లో విన్పించాయి. అప్పారావు తల పట్టుకున్నాడు. ఆ టీచర్ డ్రామా ఏక్టరయి వుంటాడు. యింకేముంది రోజూ ప్రొద్దుటే ఆయన ప్రాక్టీసు చేసుకుంటూ వుంటాడు.

సుబ్బలక్ష్మి ఒక్క పాటలతోనే సరిపెట్టేది. ఈయన ఏకంగా హార్మోనియంతో తెల్లారకుండా గొంతెత్తి అరుస్తున్నాడు. పాపం అప్పారావు పని పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయ్యింది.

★